ప్రజాశక్తి
సోమవారం 26 ఫిబ్రవరి, 2024 5 శ్రీకాకుళం

గీతాంజలి స్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

# ఇంతేనా?

సరుబుజ్జిలి మండలం రొట్టవలసలో నెట్టు వేసిన ధాన్యం బస్తాలు

- 2023 ఖరీఫ్‌లో 5.4 లక్షల టన్నులను సేకరించాలని నిర్ణయం
- ఇప్పటివరకు 4.38 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు
- మరో 50 వేల టన్నుల వరకు ఉంటుందని అంచనా
- ఈ ఏడాది సేకరణ 5 లక్షల టన్నుల లోపే

**జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరింది. ధాన్యం సేకరణలో తొలుత సాంకేతిక సమస్యలు, ధాన్యం నాణ్యంగా లేవని మిల్లరు నిరాకరించడం వంటి సమస్యలు ఎదురయినా క్రమేణా కొనుగోలు పుంజుకున్నాయి. అయితే లక్ష్యం మేర కొనుగోలు జరగలేదు. ఖరీఫ్‌లో ఇప్పటివరకు 4.38 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేశారు. ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తే మరో 40, 50 వేల టన్నులు మాత్రమే రైతుల వద్ద ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఏవిధంగా చూసుకున్నా సేకరణ 5 లక్షల టన్నులకు పరిమితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఎచ్చెర్ల, ఆమదాలవలస, పొందూరుతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో వచ్చే నెల పదో తేదీ వరకు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు.**

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్‌లో 3,51,843 ఎకరాల్లో వరి వేశారు. ఈ సంవత్సరం 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 7,87,447 మెట్రిక్ టన్నులు మార్కెట్‌లోకి వస్తుందని భావించారు. ప్రభుత్వం 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుగుణంగా ఏర్పాట్లు చేసింది. అయితే ఇప్పటివరకు 4,38,140 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. ఇందులో గ్రేడ్-ఎ రకం 281 మెట్రిక్ టన్నులు కాగా, సాధారణ రకం 4,37,858 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. జిల్లాలో పండగ సీజన్ ముందు వరకు ధాన్యం కొనుగోలు చాలా జోరుగా సాగాయి. ఆ తర్వాత మందగించాయి. ఆమదాలవలస, నరసన్నపేట, పొందూరు, జి.సిగడాం, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం తదితర మండలాల్లో ధాన్యం సేకరణ లక్ష్యానికి అనుగుణంగా జరగలేదు. పెసర, మినుము తదితర పంటలను సాగు చేస్తుండటంతో అక్కడ నూర్పులు జరగలేదు. అపరాల సాగు పూర్తి కావడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తున్నారు. జలుమూరు, సారవకోట, పోలాకి, బూర్జ, తదితర ప్రాంతాల్లో పంట వేగంగా చేతికి రావడంతో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు జరగడంతో కేంద్రాలను మూసివేశారు.

**మండలాల్లో కొనుగోలు పరిస్థితి ఇలా...**

జిల్లాలో గ్రేడ్-ఎ, సాధారణ రకం ధాన్యం కలిపి మొత్తం 4.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కంచిలిలో అత్యల్పంగా కేవలం 713 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. కవిటిలో 782 మెట్రిక్ టన్నులు, ఎచ్చెర్లలో 3,228 మెట్రిక్ టన్నులు, ఇచ్ఛాపురంలో 3,485 మెట్రిక్ టన్నులు, రణస్థలంలో 4,411 టన్నులు, పొందూరులో 4,616 టన్నులు, లావేరులో 4,507 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించారు. జిల్లాలో అత్యధికంగా జలుమూరులో 32,307 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఆ తర్వాత స్థానంలో నరసన్నపేట ఉంది. నరసన్నపేటలో 26,985 టన్నులను కొనుగోలు చేశారు. సారవకోటలో 24,846 టన్నులు కొనుగోలు చేశారు. కోటబొమ్మాళిలో 23,589 టన్నులు, నందిగాంలో 22,503 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. అదేవిధంగా మెళియాపుట్టిలో 21,591 మెట్రిక్ టన్నులు, కొత్తూరులో 20,523 మెట్రిక్ టన్నులు, మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు

**లక్ష్యం చేరుకోకపోవడానికి కారణాలివేనా?**

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, కవిటి మండలాల్లో కరువు పరిస్థితులు తలెత్తాయి. వీటితో పాటు పలాస నియోజకవర్గంలోని పలాస, వజ్రపుకొత్తూరు, ఎచ్చెర్ల నియోజకవర్గంలోని జి.సిగడాం తదితర ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల పంట అనుకున్నంత స్థాయిలో రాలేదు. ధాన్యం సేకరణకు ఈ సంవత్సరం విధించిన కొత్త నిబంధనలూ ధాన్యం లక్ష్యం చేరుకోకపోవడానికి మరో కారణంగా ఉంది. వాహనాలకు జిపిఎస్, మిల్లుల వద్ద రోజుల తరబడి నిరీక్షణ వంటి ఇబ్బందులు పడలేక రైతులు పలుచోట్ల దళారులకు అమ్ముకున్నారు. దీంతోపాటు ఈ సంవత్సరం ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిగా తెరుచుకోకముందే పచ్చి ధాన్యాన్ని సైతం కమిషన్ ఏజెంట్లు కొనుగోలు చేశారు. రాష్ట్రంలో పలు జిల్లాలో కరువు పరిస్థితుల కారణంగా పంట లేకపోవడంతో ఆయా ప్రాంతాలకు జిల్లా నుంచి ధాన్యం రవాణ జరిగినట్లు తెలుస్తోంది. దీంతో ఈ సంవత్సరం ధాన్యం సేకరణ 5 లక్షల టన్నుల్లోపే పరిమితం కానుంది.

# ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

- 24,500 మంది దరఖాస్తు
- 3,946 మంది గైర్హాజరు

ఆమదాలవలస : అభ్యర్థుల హాల్ టిక్కెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 82 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. పరీక్షలకు 24,500 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 20,554 మంది (83.89 శాతం) రాశారు. పరీక్షకు 3,946 మంది గైర్హాజరయ్యారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక అఫీషియల్ కాలనీలో గల గీతాంజలి స్కూల్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సందర్శించారు. పరీక్షలు జరగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. రూట్ ఆఫీసర్ జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.విప్రసాద్, లైజన్ ఆఫీసర్ పి.ఉమామహేశ్వరరావు, సూపరింటెండెంట్ కృష్ణవేణి పాల్గొన్నారు. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఫార్మసీ, పాలిటెక్నిక్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని జెసి ఎం.నవీన్ పరిశీలించారు. అభ్యర్థుల సంతకాల రిజిస్టర్‌ను, రోల్ నంబర్ కనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లను చూశారు. పరీక్ష సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే టెక్కలిలోని అన్ని పరీక్షా కేంద్రాలను సబ్ కలెక్టర్ నూరల్ కమర్ పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని డిప్యూటీ సిఇఒ వెంకట్రామన్ పరిశీలించారు. పలాసలోని ఆర్‌డిఒ భరత్ నాయక్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి పర్యవేక్షించారు.

టెక్కలి : ప్రశ్నాపత్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్

**బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి**

గ్రూప్-2 పరీక్ష నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌పి జి.ఆర్.రాధిక స్వయంగా పరిశీలించారు. పరీక్షా కంద్రాల ఆవరణలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. అభ్యర్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకువెళ్లకుండా సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహించారని తెలిపారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లను మూయించామని చెప్పారు.

ఎచ్చెర్ల : వెంకటేశ్వర కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి నవీన్

# ఇఎస్ఐ లోకల్ పే ఆఫీసు ఏర్పాటు చేయాలి

వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పైడిభీమవరంలో ఇఎస్ఐ లోకల్ పే కార్యాలయం ఏర్పాటు చేయాలని, డిస్పెన్సరీలో రిఫరల్ సౌకర్యం కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ డిమాండ్ చేశారు. పైడిభీమవరం ఇఎస్ఐ డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభానికి ఆదివారం విచ్చేసిన ఇఎస్ఐ ఎపి రీజినల్ డైరెక్టర్ ఎ.వేణుగోపాలరావు, డిప్యూటీ డైరెక్టర్ జోస్ మార్టిన్‌లను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఇఎస్ఐ టై ఆఫ్ ఆస్పత్రులు ఏర్పాటు చేసి కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. జిల్లాలో ఎచ్చెర్ల, శ్రీకాకుళంలో ఇఎస్ఐ డిస్పెన్సరీలు ప్రారంభించి డాక్టర్లను, సిబ్బందిని నియమించి కార్మికులకు వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లాలో వంద పడకల ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే సకాలంలో సరైన వైద్యం అందక కార్మికులు మృతి చెందుతున్నారని, దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇఎస్ఐ రిఫరల్ రాయించుకోవడానికి విశాఖపట్నంలోని మల్కాపురం వెళ్లాల్సి వస్తుందన్నారు. పలాస నుంచి యితే 200, శ్రీకాకుళం నుంచి అయితే 120 కిలోమీటర్లు దూరం వ్యయ ప్రయాసలతో రోగులు వేళ్లలేకపోతున్నారని తెలిపారు. గతంలో మాదిరిగా డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్‌లో రిఫరల్ సౌకర్యం కల్పించాలని కోరారు. పైడిభీమవరం ఇఎస్ఐ డిస్పెన్సరీ పరిధిలో సుమారు 18 వేల మంది కార్మికులు ఉన్నారని వివరించారు. లోకల్ పే ఆఫీసు లేకపోవడంతో సెలవు కోసం శ్రీకాకుళం, విజయనగరం వెళ్లాల్సి వస్తోందన్నారు. అలాగే డిస్పెన్సరీల్లో అన్నిరకాల మందులు సరఫరా చేయాలనిన్నారు. కార్యక్రమంలో ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జిల్లాకు చంద్రబాబు

- శ్రీకాకుళం నగరంలో 'రా కదలిరా సభ'
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా నాయకత్వం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సోమవారం జిల్లాకు రానున్నారు. శ్రీకాకుళం నగరంలో నిర్వహించనున్న రా కదలిరా సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో జిల్లా నాయకత్వం ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేసింది. శ్రీకాకుళం నగరంలోని స్థానిక 80 అడుగుల రహదారి ప్రాంతంలో సభా వేదిక నిర్మించారు. సభకు లక్ష మందిని తరలించాలని పార్టీ నాయకత్వం లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో అందుకనుగుణంగా ఏర్పాట్లను చేస్తున్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ పరిశీలకులు గణబాబు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండ లక్ష్మీదేవి సభా వేదిక, గ్యాలరీలను పరిశీలించారు.

సిద్ధమైన సభావేదిక

**పర్యటన షెడ్యూల్ ఇలా**

గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసం నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరనున్నారు. మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీకాకుళం ఆర్‌అండ్‌బి బంగ్లా ప్రాంగణంలో ఏర్పాటు చేసి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి 2.55 గంటలకు బయలు దేరి సభావేదిక వద్దకు 3 గంటలకు చేరుకుంటారు. 3 నుంచి 4.30 గంటల వరకు బహిరంగసభలో పాల్గొంటారు. తర్వాత 4.45 గంటలకు సభావేదిక నుంచి బయలుదేరి హెలీ ప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి విశాఖకు పయనం కానున్నారు.

**సభను విజయవంతం చేయాలి**

శ్రీకాకుళం రూరల్ : టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సోమవారం చేపట్టనున్న రా కదిలి రా భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి టిడిపి నాయకులకు పిలుపునిచ్చారు. మండలంలోని గూడెం, లింగాలవలస, లంకాం, రాగోలు, వాకలవలస, శిలగాం సింగువలస, తండేంవలస పంచాయతీల్లో ఆదివారం పర్యటించి ప్రజలను అధిక సంఖ్యలో సభకు తరలించాలని కోరారు. ఆమెతో పాటు చిట్టి మోహనరావు, బలగ చెంగలరావు పాల్గొన్నారు.

# 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం

**వర్చువల్ విధానంలో ప్రారంభించిన ప్రధాని మోడీ**

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నేషనల్ హెల్త్ మిషన్ ప్రాజెక్టులో భాగంగా స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ రూ.23.75 కోట్లతో నిర్మించనున్నారు. ఈ బ్లాక్ నిర్మాణ పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ఆదివారం శంకుస్థాపన చేశారు. గుజరాత్ రాష్ట్రంలోని రాజకోట్‌లో జరిగిన సమావేశం నుంచి దేశ వ్యాప్తంగా హెల్త్ కేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రారంభాలు, శంకుస్థాపనలు చేశారు. ఆంధ్రాలో 9 క్రిటికల్ కేర్ బ్లాక్‌లను వర్చుల్‌గా శంకుస్థాపనలు చేశారు. అందులో జిల్లాలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిజిహెచ్ మెడికల్ కళాశాల నుంచి లైవ్ టెలికాస్ట్ ద్వారా కలెక్టర్, ఎపిఎచ్ఎమ్ ఐడిసి ఇఇ ఎం.సత్యప్రభాకర్, సూపరెంటెండెంట్ స్వామినాథన్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలం, డిప్యూటీ సూపరెంటెండెంట్ డాక్టర్ కె.సునీలానాయక్, హెచ్‌డిఎఫ్‌సి సలహా సభ్యులు, సిఎస్ఆర్ఎమ్ సుభాషిణి, ఎం సత్యానంద్, విద్యార్థినీ విద్యార్థులు తిలకించారు అనంతరం కలెక్టర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

పాల్గొన్న కలెక్టర్, తదితరులు

# పదవిలో ఉన్నా... లేకున్నా అండగా ఉంటా

**రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు**

మాట్లాడుతున్న మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తనకు రాజకీయాలు శాశ్వతం కాదని, ఓడినా, గెలిచినా మీ స్నేహితుడనేనంటూ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యానించారు. నగరంలోని పి.ఎన్.కాలనీలో కళింగ కోమట్లు ఆదివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాజకీయాలంటే కేవలం భౌతికంగా కన్పించే అంశాలే కాదు ప్రశాంత జీవనానికి కావల్సిన అంశాలను చేకూర్చడమేనని అన్నారు. తాను అధికారంలో ఉన్నా... లేకున్నా మీ స్నేహితుడిగానే ఉంటానని అన్నారు. నగరంలో కళింగ కోమట్లు సజావుగా వ్యాపారాభివృద్ధి చేసుకునేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశానని అన్నారు. జిల్లా అభివృద్ధికి వచ్చిన ప్రతి అవకాశాన్నీ ఒడిసిపట్టుకున్నానన్నారు. విశ్రాంతి కావాలన్నా... సిఎం జగన్ పోటీ చేయాలని చెప్పారని, ఆయన మాటకు కట్టుబడి ఈ సారి ఎన్నికల బరిలో ఉన్నానని పేర్కొన్నారు. ఇదే నాకు చివరి ఎన్నికలు స్పష్టం చేశారు. సమావేశానికి రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోణార్క్ శ్రీను, అంధవరపు ప్రసాద్, ఊన్న నాగరాజు, అంధవరపు కొండబాబు, గుడ్ల దామోదరరావు, తంగుడు జోగారావు, అంధవరపు రమేష్ పాల్గొన్నారు.

# స్పీకర్ దంపతులు అరసవల్లి సందర్శన

చిత్రపటాన్ని స్వీకరిస్తున్న స్పీకర్ సీతారాం దంపతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని శాసన సభ స్వీపకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ సంప్రదాయ బద్ధంగా స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంరతం వారికి అనివేటి మండపంలో స్వామివారి శేష వస్త్రాలను కప్పి చిత్రపటాన్ని అందజేశారు. అలాగే హైదరాబాద్ బెంచ్ హనరబుల్ జ్యుడిషియల్ మెంబర్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) డాక్టర్ వెంకట రామకృష్ణ బద్రినాథ్ నందుల అరసవల్లి సందర్శించారు. ఆయనకు జ్ఞాపికను ఆలయ ఇఒ డి.ఎల్.వి.రమేష్‌బాబు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు లుకాలపు గోవిందరావు పాల్గొన్నారు.

**రూ. 9.56 లక్షల ఆదాయం**

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి మాఘ ఆదివారం కావడంతో యాత్రికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీనివల్ల ఆలయానికి ఒక్కరోజు రూ.9.56 లక్షల ఆదాయం సమకూరినట్టు ఇఒ రమేష్‌బాబు తెలిపారు. టిక్కెట్లు రూపేనా రూ.4,72,300, విరాళాల రూపంలో రూ.1,79,237లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3,05,000లు ఆదాయం సమకూరినట్టు వివరించారు.

# ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- సిసి కెమేరాల పర్యవేక్షణలో 113 కేంద్రాల్లో నిర్వహణ
- 210 మంది సిబ్బంది పర్యవేక్షణ
- 52 వేల మంది విద్యార్థులు రాసేందుకు సిద్ధం
- ఆర్‌ఐఒ దుర్గారావు

పి.దుర్గారావు, ఆర్‌ఐఒ




ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

**ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఇంటర్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ప్రగడ దుర్గారావు తెలిపారు. 113 పరీక్షా కేంద్రాల్లో ఈ ఏడాది పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల్లో మాస్ కాపీయింగ్, ఇతర రకాలైన అక్రమాలకు తావు లేకుండా పరీక్షా కేంద్రల్లో సిసి కెమేరాల పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు. వాటిని జిల్లాలో ఆర్‌ఐఒ, రాష్ట్రస్థాయిలో ఇంటర్ బోర్డు కార్యాలయం నుంచి పర్యవేక్షించేలా అనుసంధానిస్తున్నామని తెలిపారు. పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.**

**? మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీసుకు తావులేకుండా చర్యలు ఎలా ఉండ బోతున్నాయి?**

పరీక్షల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రతి కేంద్రంలోనూ అన్ని గదుల్లో సిసి కెమేరాలను ఏర్పాటు చేశాం. విద్యార్థుల ముఖచిత్రాలు వాటిలో నిక్షిప్తం చేయడంతో అభ్యర్థులపై నిఘా ఉంటుంది. సాంకేతిక నిపుణుల కమిటీ ప్రతి కేంద్రానికీ వెళ్లి కనెక్షన్ ఇస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వంద శాతం ఇవి పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షలు జరుగుతున్న తీరును కమిషను కార్యాలయం నుంచే చూడడానికి వీలుంటుంది. చూచిరాతలు, పరీక్షకు ఆలస్యంగా వచ్చే వారి విషయంలో ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. విద్యార్థులకు అసౌకర్యాలు, ఇబ్బందులు కలిగితే స్పందించేందుకూ వీలుంటుంది.

**? ఎన్ని కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు?**

జిల్లాలో 113 కేంద్రాల్లో 52 వేల మంది ఇంటర్మీడియట్ పరీక్షలు సిద్ధమయ్యారు. పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. మానవ నైతిక విలువలపైన, పర్యావరణ విద్యపై పరీక్షలు ఉదయం 10 నుంచి ఒంటి వరకు మాత్రమే జరుగుతాయి. మిగిలిన పరీక్షలన్నీ నిబంధనలకు అనుగుణంగా నిర్దేశించిన సమయాల్లో నిర్వహిస్తున్నాం.

**? పరీక్షల నిర్వహణకు ఎలాంటి సౌకర్యాలు కల్పించనున్నారు?**

జిల్లావ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు కేంద్రాలను సిద్ధం చేశాం. పరీక్షలు రాసేందుకు విద్యార్థులు పూర్తి సమర్థతతో ఉన్నారు. పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు విద్యార్థులకు ఆయా ప్రాంతాల వారీగా సమయానుకూలంగా ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బందితో పాటు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులను వైద్య ఆరోగ్యశాఖ సిద్ధం చేసుకుంటున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

**? ప్రశ్నాపత్రాల రక్షణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?**

ఇంటర్ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల భద్రత అత్యంత కీలకం. ప్రశ్నాపత్రాలను తీసుకెళ్లడం, తిరిగి తీసుకురావడం, వాటిని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరచడం ఎంతో కీలకం. తీసుకువెళ్లే వాహనాలు వెంట పోలీసుల రక్షణ ఉంటుంది. అలాగే పరీక్షా కేంద్రాలకు దగ్గరలో జిరాక్స్ షాపులను మూసివేసేలా చర్యలు తీసుకుంటున్నాం. మరోవైపు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఇంటర్మీడియట్ పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు.

**? ఆలస్యమైతే వారిని అనుమతిస్తారా?**

నిర్దేశించిన వేళల్లో జరిగే పరీక్షలకు అర గంట ముందే కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాల్సి ఉంటుంది. అనుకోని ఘటనలు ఎదురైతే వారికి పరీక్ష ప్రారంభమైన తరువాత 15 నిమిషాల వరకే లోపలకు అనుమతిచ్చేందుకు వీలుంటుంది. అనుకోని కారణాలతో బస్సు ఆలస్యం వంటి కారణాలకు మాత్రమే వెసులుబాటు కల్పించాలని బోర్డు నుంచి ఆదేశాలున్నాయి.

**? పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే వారికి ఎలాంటి కోడ్ అమలులో ఉంటుంది?**

పరీక్షల పర్యవేక్షణలో ఉన్న అధికారులకు గుర్తింపు కార్డుల జారీ చేస్తున్నాం. ముఖ్య పర్యవేక్షకులు, డిపార్ట్‌మెంట్ అధికారులే సెల్‌ఫోన్లను తీసుకెళ్లొచ్చు. వారూ ఆయా కేంద్రాల్లో ఫోన్ మాట్లాడడానికి వీల్లేదు. ఉన్నతాధికారులు ఫోన్ చేసేటప్పుడు మాత్రమే స్పందించాలి. ఇన్విజిలేటర్లు సెల్ ఫోన్‌ను తీసుకెళ్లకూడదు. కేంద్రాల్లో ఇతరులు ప్రవేశించకుండా సబార్డినేట్ నుంచి చీఫ్ సూపరింటెండెంట్ వరకు అందరికీ ఐడీ కార్డులు జారీ చేస్తున్నాం.

**? కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నారా?**

ఇంటర్ పరీక్షల్లో విద్యార్థుల కోసం జిల్లా కార్యాలయంలో ప్రత్యేక నియం త్రణ విభాగాన్ని (కంట్రోల్ రూమ్) ఏర్పాటు చేశాం. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేటప్పుడు, కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా 08942278151 నంబరును సంప్రదించాలని సూచనలు చేశాం. మరోవైపు ప్రతి కేంద్రంలోనూ సిసి కెమేరాలు ఉండేలా చూసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేశాం. విధుల్లో 210 మంది ఎగ్జామినర్లు, 113 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఆర్‌ఐఒ బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్, డిఇసి కమిటీ, డిడిఇఒ బృందం పర్యవేక్షణ ఉంటుంది. పరీక్షా కేంద్రాల వద్ద సెల్‌ఫోన్ ఫ్రీ జోన్‌గా ప్రకటించాం. విధుల్లో ఉన్న అధ్యాపకులు, విద్యార్థులు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను తీసుకెళ్లకుండా ఆదేశాలు జారీ చేశాం.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

## సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

**ప్రజాశక్తి - రణస్థలం**

మండలం లావేరు పంచాయతీ గ్రామ సచివాలయ కన్వీనర్ తూట అప్పలరాజుకు సిఎం సహాయ నిధి రూ.4.50 లక్షల చెక్కును ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలు ఆపదలో ఉంటే నేనున్నానని ఆదుకోవడం సిఎం జగన్ మంచి మనసుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి లంకలపల్లి గోపి, లావేరు ఎంపిటిసి ఇనపకుర్తి సతీష్, వైస్ సర్పంచ్ పైడి దాము, వైసిపి నాయకులు ఇనపకుర్తి రాంబాబు, సగరపు విశ్వనాథం, తలారి నాగయ్య, నక్కిన అసిరప్పడు, యర్ర బాబ్జి, నల్ల వాసు, దోర వెంకటరమణ పాల్గొన్నారు.

## 'కొత్తమ్మతల్లి' సందర్శన

**ప్రజాశక్తి - కోటబొమ్మాళి**

స్థానిక కొత్తమ్మతల్లి అమ్మవారిని ఆదివారం దేవాదాయ ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ బి.వి.వి. ప్రసాద్ పట్నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ, వేదపురోహితులు సుసరాపు జనార్ధన శర్మలు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ప్రసాదరావు

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్**

గార మండలం రామచంద్రపురం పంచాయతీ శ్రీనగర్ కాలనీలో ఆదివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గొలివి వెంకటరమణ, ఎంపిటిసి రుప్ప శ్రీనివాసరావు, ఎంపిపి రఘురాం, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షులు కంట, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి నాగభూషణం, సర్పంచ్ ప్రతినిధి ఏళ్ల నారాయణ పాల్గొన్నారు.

మండలంలోని అంబటివానిపేట గ్రామం వద్ద రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో అట్టడుగున ఉన్న ప్రజలకు ఆయన అండగా నిలిచారని గుర్తుచేశారు. అటువంటి మహనీయుని ఎల్లప్పుడు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు

## బకాయిలను తక్షణమే చెల్లించాలి

**పొందూరు:** ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు, విజయనగరం జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి సన్యాసిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఆదివారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ప్రాంతీయ సమావేశం కొమ్ము అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సిఎఫ్ఎంఎస్‌లో పెండింగ్ ఉన్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎ పెండింగ్ బిల్లులను పరిష్కరించి ఉపాధ్యాయుల ఖాతాలో జమ చేయాలన్నారు. ఎపిజెఎసి చలో విజయవాడకు వెళ్లకుండా నిరోధించేందుకు వివిధ సంఘ బాధ్యులకు పోలీసులు నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో పొందూరు, జి.సిగడాం, సంతకవిటి, లావేరు మండలాల కార్యకర్తలతో కమిటీలు ఏర్పాటు చేశారు. పొందూరు మండల అధ్యక్షులుగా బలివాడ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా గురుగుబెల్లి భాస్కరరావు, జి.సిగడాం మండల అధ్యక్షులుగా శిల్లా భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా గురుగుబెల్లి శ్రీరామదత్త, లావేరు అధ్యక్షులుగా బాలకృష్ణను నియమించారు. సమావేశంలో గురుగుబెల్లి రాజశేఖర్, జి.గోపాలరావు, జి.రామారావు, జి.వెంకటరావు, గజపతిరావు, బి.వి.రమణ పాల్గొన్నారు.

## సుదర్శన్ సేవలు మరువలేనివి

**పలాస:** గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి బొడ్డేపల్లి సుదర్శనరావు సేవలు మరువలేనివని పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. మండలం బ్రాహ్మణతర్ల సచివాలయంలో ఆదివారం బొడ్డేపల్లి సుదర్శనరావు సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదర్శనరావు అకాల మరణం కలిచివేసిందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందించి అందరి మన్ననలు పొందారని గుర్తు చేశారు. తన విధి నిర్వహణలో ఎంతోమందికి ఎన్నో విధాలుగా ఆదుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.పుష్ప, కార్యదర్శి లక్ష్మణ రేఖ, కంచరాన చాణక్య, వాలంటీర్లు పాల్గొన్నారు.

## గోపికి 'హరివిల్లు కవి భాస్కర' పురస్కారం

**ప్రజాశక్తి - కవిటి**

గోపి

చిట్టి చిట్టి కవితలతో తొమ్మిది వందల హరివిల్లు కవితలు పూర్తిచేసిన ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మొర్రి గోపికి భద్రాద్రి సాహితి వేదిక, కొత్తగూడెం జిల్లావారు ఆన్‌లైన్ వేదికగా 'హరివిల్లు కవి భాస్కర' పురస్కారం అందజేశారు. ఈ మేరకు భద్రాద్రి సాహితీ వేదిక అధ్యక్షుడు సీర హరిప్రసాద్, కార్యదర్శి చిట్టి మధు, హరివిల్లు ప్రక్రియ రూపకర్త మామిడి రమేష్ గోపి మాస్టారికి అభినందనలు తెలియజేశారు. అలతి పదాలతో అద్భుతమైన భావాలు పలికిస్తూ తెలుగు సాహితీ సేవలో నిరంతర ప్రయాణం చేస్తున్న గోపికి పురస్కారం లభించడంపై ఎంఇఒ ధనుంజయ మజ్జి, కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ లక్ష్మణరావు, ఉషోదయ యువజన సంఘ అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్, సభ్యులు ఆరంగి మధు, ఆరంగి త్రివిక్రమరావు, బెందాలం రమేష్, తమరాల జయరాం, పొల్లయి లక్ష్మణమూర్తి తదితరులు అభినందనలు తెలియజేశారు.

## సమర్థవంతమైన ప్రసంగాలపై శిక్షణ

**ఇచ్ఛాపురం:** స్థానిక జెసిఐ సంస్థ అధ్వర్యంలో ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీచ్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. విజె ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సమర్థవంతంగా బహిరంగ ప్రసంగం ఎలా చెప్పాలో ట్రైనర్ రాజేష్ మాట్లాడే విధానంపై మెళకువలు చెప్పారు. శిక్షణా కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న 30 మందికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో జెసిఐ అధ్యక్షలు టి.షణ్ముఖరావు, ప్రోజెక్ట్ ఛైర్మెన్ ఢిల్లేసు, స్వరూప్ కుమార్, పవన్ కుమార్, ప్రేమ సాయి పాల్గొన్నారు.

# ఎన్నాళ్లీ అవస్థలు

- రోడ్లు పైన మురుగునీరు
- కుళాయిల ద్వారా అరకొర నీరు

కుళాయి చుట్టూ నిల్వ ఉన్న మురుగునీరు

**ప్రజాశక్తి - బూర్జ**

ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు హామీలు గుప్పిస్తున్నా ఆ గ్రామానికి కనీస సదుపాయాలు కల్పించడం లేదు. ప్రభుత్వం మారిన ప్రతిసారి తమ గ్రామానికి రహదారులు, కొళాయిల ద్వారా తాగునీరు అందుతుందని ఆశపడ్డ మండలంలోని మామిడివలస గ్రామస్తులకు నిరాశే ఎదురవుతుంది.

**మురుగునీరు రోడ్లపైనే..**

గ్రామంలో ఇరువైపులా కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోందని దీని ద్వారా వ్యాధులకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి నాయకులు కాలువలు ఏర్పాటు చేస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ ఆదిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని గ్రామస్తుల పేర్కొన్నారు. గ్రామంలో పక్కా రోడ్లు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే నిల్వ ఉండిపోతుందని, వర్షాకాలంలో చెరువులను తలపిస్తున్నాయన్నారు. గ్రామంలో కుళాయిలు ఉన్నప్పటికీ తాగునీరు రావడంలేదని గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళుతున్నప్పటికీ పట్టించుకున్న నాధుడే కరువయ్యారని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకవర్గం స్పందించి గ్రామంలో కాలువలు, పక్కా రహదారులను నిర్మించాలని, వస్తున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా తాగునీటి సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు

నినాదాలు చేస్తున్న జనసేన నాయకులు

## వైసిపిని గద్దె దించడమే జనసేన లక్ష్యం

**ప్రజాశక్తి - పలాస**

రాష్ట్రంలో వైసిపి పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రానున్న ఎన్నికల్లో వైసిపి గద్దె దించడమే జనసేన లక్ష్యమని జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. కాశీబుగ్గలో ఆదివారం జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి, జనసేన గెలుపు తథ్యమని జోస్యం చెప్పారు. జనసేనకు సీట్లు కేటాయించడంలో తీవ్ర అన్యాయం జరిగిందని అధికార పార్టీకి చెందిన నాయకులు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారం చేపట్టిన తరువాత వార్డు కౌన్సిలర్ నుంచి రాజ్యసభ వరకు అన్నీ స్థానాల్లో 30 శాతం వరకు జనసేన నాయకులకు పవన్ కళ్యాణ్ పదవులు కట్టబెట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టిడిపి, జనసేన నాయకులు కలిసి కట్టుగా పనిచేసి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పిసిని చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ కోత పూర్ణ చంద్రరావు, జిల్లా ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ కంచరాన అనిల్, జి.సత్తిబాబు, అట్టాడ వాసు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

**శిరీషను కలిసిన జనసేన నాయకులు**

పలాస టిడిపి కార్యాలయంలో ఆదివారం జనసేన నాయకులు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను మర్యాదపూర్వకంగా కలిశారు. శిరీషను కలిసిన వారిలో జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్, జనసేన జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్, సంతోష్ పండా ఉన్నారు.

## కోర్టుకు హాజరైన ఎస్ఇ

**ప్రజాశక్తి - ఆమదాలవలస**

ఆమదాలవలస-శ్రీకాకుళం రహదారి గుంతలపై రోడ్లు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ జాన్ సుధాకర్ కోర్టుకు హాజరైనట్లు న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి దుస్థితిపై ఇటీవల కోర్టులో దాఖలు చేసిన పిఎల్‌సి కేసు విషయమై న్యాయమూర్తి ఎదుట హాజరై రహదారి గుంతలను తాత్కాలికంగా మరమ్మత్తులు చేయడానికి అంగీకరించినట్లు తెలిపారు. గతంలో పనులు చేపట్టిన గుత్తేదారుకు రూ.14.83 కోట్ల బిల్లులను చెల్లించాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. కాంట్రాక్టర్ పనులు చేపట్టడానికి కోరిన గడువు మేరకు రోడ్డు పనులను ఈ ఏడాది జూన్ 25 నాటికి పూర్తి చేస్తామని కోర్టుకు తెలియజేశారని మోహనరావు తెలిపారు. ప్రజల సమస్యలను అధికార పార్టీ నాయకులు పట్టించుకోక పోయినప్పటికీ న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు న్యాయస్థానంలో కేసు వేసి ప్రజల పక్షాన నిలవడం ఆనందంగా ఉందని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 'కార్పొరేట్లకు అటవీ సందప'

**ప్రజాశక్తి - పలాస**

అడవులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికే 2023 అటవీ సంరక్షణ చట్టం అమలులోకి తీసుకువచ్చారని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. లొత్తూరు హల్దిగాం ఆధ్వర్యంలో జయమ్మ నాలుగో వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అరుణ పతాకాన్ని సవర గంగన్న ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ సవర మోహన్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 అటవీ సంరక్షణ చట్టం ఆదివాసులకే కాదు భారతదేశానికే నష్టదాయకమన్నారు. దేశంలో ఉన్న సహజ సంపదలను, ఖనిజాలను, అటవీ సంపదలను విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, కార్యదర్శి బైరి కూర్మారావు, జుత్తు వీరాస్వామి, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ పాల్గొన్నారు.

## 'నమ్మకాన్ని వమ్ము చేయను'

**ప్రజాశక్తి - కవిటి**

అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి మొదటి విజయం ఇచ్ఛాపురం నుంచే మొదలవుతుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టిడిపి మొదటి విడత ప్రకటించిన సీట్లలో 63మంది పట్టభద్రులు ఉండడం హర్షించదగ్గ విషయమన్నారు. టిడిపి ఏర్పడినప్పటి నుంచి ఒక్కసారి మినహా ఇచ్ఛాపురంలో టిడిపి జయకేతనం ఎగురవేసిందని, అదే ఆనవాయితీ కొనసాగిస్తూ ఈసారి కూడా అత్యధిక మెజారిటీతో ఇచ్ఛాపురంలో విజయం సాధిస్తానని ఎమ్మెల్యే అశోక్ ధీమా వ్యక్తం చేశారు.

## గురువులకు సన్మానం

**ప్రజాశక్తి - ఆమదాలవలస**

తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఇందుకు పట్టణంలోని చిన్నకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాల వేదికగా నిలిచింది. 1988-89 ఏడో తరగతికి చెందిన విద్యార్థులందరూ కలిసి ఆదివారం తమకు విద్య నేర్పిన గురువులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. నాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుంటూ స్నేహితులందరూ సరదాగా గడిపారు. తమ వద్ద విద్యాభ్యాసనం చేసిన విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థితికి చేరుకోవడంపై గురువులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బలివాడ ప్రసాదరావు, కుసుమకుమారి, తవిటమ్మ, ఆచార్యులు, అప్పలనాయుడు, జగన్నాథరావు, ప్రసాదరావు, సీతారాం, శివరామకృష్ణ, కుశరాజు పాల్గొన్నారు.

## 'గడప గడప'తో సమస్యల పరిష్కారం

సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న స్పీకర్ సీతారాం

**ప్రజాశక్తి - సరుబుజ్జిలి**

సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఐదేళ్ల కాలంలో లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు సంక్షేమ ఫలాలు ఏ స్థాయిలో ప్రజలకు అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం సిఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. సచివాలయాల ద్వారా ప్రజల ముంగిటకు పాలనను తీసుకువచ్చారని, వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను ఇంటికే చేరవేశారన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు కెవిజి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తులసీవరప్రసాద్‌కు సీటు ఇస్తే హ్యాట్రిక్ సాధిస్తాం

**ప్రజాశక్తి - కొత్తూరు**

వైసిపి జిల్లా కోశాధికారి, పాతపట్నం నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాద్‌కు ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే హ్యాట్రిక్ సాధిస్తామని ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డికి పాతపట్నం నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు తెలిపారు. విశాఖ పట్నంలో ఆయనను ఆదివారం కలిశారు. తమపై కేసులు పెట్టి రెడ్డి శాంతి క్యాడర్‌కు అన్యాయం చేశారని వెల్లడించారు. ప్రజలను, కార్యకర్తలను పట్టించుకోకపోవడంతో నియోజకవర్గంలో 32 గ్రామాల్లో ఎమ్మెల్యేని అడ్డుకున్నారనే విషయాన్ని గుర్తుచేశారు.ఇటువంటి వ్యక్తి మళ్లీ పోటీ చేస్తే టిడిపి అభ్యర్థి కలమట వెంకటరమణ విజయం సునాయాసం అవుతుందన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి తాము మద్దతు ఇవ్వబోమని తేల్చి చెప్పారు. మాజీ జెడ్‌పిటిసి బుయ్యాల చిట్టి బాబు, కామాక్షి ప్రసాద్ బ్రహ్మ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లోహితాక్షుడు, మాజీ ఎంపిటిసి రామకృష్ణ, వైసిపి మాజీ మండల అధ్యక్షులు తాతబాబును సుబ్బారెడ్డి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్ఆర్ సిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసి వరప్రసాదరావుతో వై.వి.సుబ్బారెడ్డి ప్రత్యేకంగా చర్చించారు. సిఎం దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని సుబ్బారెడ్డి హామీ ఇవ్వడంతో వారంతా జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ వెనుతిరిగారు. సుబ్బారెడ్డిని కలిసిన వారిలో.పాతపట్నం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట, హిరమండలం, మెళియాపుట్టి మండలాలకు చెందిన జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు తదితరులున్నారు.

సుబ్బారెడ్డిని కలిసిన పాతపట్నం వైసిపి నాయకులు

## లక్ష్యాలను సాధించాలి

ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న గురవారెడ్డి, భాస్కరరావు

**ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్**

మీరు సాధించాలనుకున్న లక్ష్యాన్ని పట్టు వదలకుండా ప్రయత్నిస్తేనే విజయం మీ సొంతమవుతుందని సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఆస్పత్రి ఛైర్మన్ గురువారెడ్డి అన్నారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో 2019 బ్యాచ్ ఎంబిబిఎస్ విద్యార్థుల స్నాతకోత్సవ సెమినార్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ ఎంబిబిఎస్ విద్యార్థుల చదువు ఒక ఎత్తు అని, ఇప్పుడు జీవితాన్ని చదవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మీరు ఆసక్తి ఉన్న రంగం వైపు పయనించాలని సూచించారు. మీ వద్దకు వచ్చిన రోగిని ఓ బంధువులా చూడాలని, ఆ రోగి నుంచే పూర్తిస్థాయి సబ్జెక్టు నేర్చుకునేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు. జెమ్స్ ఆస్పత్రి అధినేత బొలినేని భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు నేర్చుకున్న సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. హౌస్ సర్జన్‌గా ముందుకు వెళ్తూ పిజిలో చేరే ముందు రెండు నెలల శిక్షణకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జెమ్స్ ఆస్పత్రి సిఇఒ బొలినేని అద్విక్, సిఎఒ రామ్మోహన్‌రావు, జనరల్ మెడిసిన్ హెచ్‌ఒడి డాక్టర్ సుధీర్, కళాశాల మెడికల్ సూపరింటెండెంట్ అశోక్, కళాశాల ప్రిన్సిపాల్ లలిత, విద్యార్థుల తల్లిదండ్రులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్టుబడుదారీ విధానాలను తరిమికొట్టాలి

### విరసం రాష్ట్ర నాయకులు ఖాసీం

**పలాస :** ప్రస్తుతం దేశంలో ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు భరోసానిస్తూ పేద రైతు, శ్రామిక వర్గాలకు దగా చేస్తున్నాయని, వారిని పోరాటాల ద్వారా తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకులు, ప్రొఫెసర్ ఖాసీమ్ అన్నారు. మండలంలోని బొడ్డపాడులో బొడ్డపాడు యువజన సంఘం 70వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విప్లవ యోధులు సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖ పాణిగ్రాహి, దుమ్ము అప్పలస్వామి తల్లి దుమ్ము నారాయణమ్మలు కార్మిక కర్షక పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ మాట్లాడుతూ వేల కోట్లు అప్పులను పెట్టుబడిదారులకు ఇస్తూ... వారు ఆ రుణాలను తీర్చకపోయినా ప్రభుత్వాలు స్వేచ్ఛగా మాపీ చేస్తున్నాయని అన్నారు. పేదలు బ్యాంకులకు రుణం తీర్చలేకపోతే వారిపై మెడపై కత్తి పెట్టిమరి వసూలు చేస్తున్నారని దుయ్యబట్టారు. యువజన సంఘ అధ్యక్షుడు తామాడ క్రాంతికుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కులనిర్మూలన పోరాట సమితి నాయకులు మిస్క కృష్ణయ్య, డిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కోత ధర్మారావు, రైతాంగ కమిటీ నాయకుడు దాసరి శ్రీరాములు, ఎబిఎం సభ్యులు తామాడ త్రిలోచనరావు, కిక్కర ఢిల్లీరావు పాల్గొన్నారు. ముందుగా పాడేరు గిరిజన కళాకారుల థింసా నృత్యం, రామనర్సయ్య జానపద నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న ఖాసీం

## స్పష్టత లేని ఇసుక విధానం

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక విధానంపై స్పష్టత లేదని, ఇష్టారాజ్యంగా నదుల్లో యంత్రాలతో ఇసుక తవ్వి తరలిస్తున్నా పర్యవేక్షణ కరువైందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అరసవల్లిలోని ఆయన స్వగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇసుక తవ్వకాలపై ప్రత్యక్షంగా పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ శాఖలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. తవ్వకాలపై అభ్యంతరాలున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ సమీక్షించినా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకునే అధికారులు పర్యవేక్షణ శాఖలకు లేకుండా చేశారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ఇసుక ధరను విపరీతంగా పెంచడంతో పాటు సామాన్యులు ఇళ్లు కట్టుకోవాలన్నా దొరకని పరిస్థితి కల్పించారన్నారు. ఇసుక కాంట్రాక్టర్లు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. మరోవైపు నదీపరివాహన ప్రాంతాల్లో సైతం భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, అధికారులు ఉన్నతస్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్టు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అక్రమ తవ్వకాలపై కలెక్టర్ సమీక్ష సమయంలో ఆశాఖ అధికారులు రేవుల పరిశీల నివేదికలో జియో కోడ్స్ ప్రస్తావించలేదని నిర్భయంగా చెప్పడం స్వాగతించాలన్నారు. వర్షాకాలంలో ఇసుక అందించడానికి పలాస, నైర, రామకృష్ణాపురం, కంచిలి తదితర ఆరు స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసినట్టు చెపుతున్న అధికారులు వేసవికి ముందు ఏ ప్రాతిపదికన ఏర్పాటు చేశారో చెప్పాలని కోరారు.

## టిడిపిలో పలు కుటుంబాలు చేరిక

**ప్రజాశక్తి - కోటబొమ్మాళి**

రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు సమక్షంలో ఆదివారం టిడిపి కార్యాలయంలో టెక్కలి పట్టణం నుంచి 500 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడులు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సంతబొమ్మాళి మండలం సంధిపేట గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు అచ్చెన్నాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. అలాగే ఉమ్మిలాడ పంచాయతీ కొవిరిపేట గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టిడిపిలో చేరారు. వీరికి రామ్మోహన్‌నాయుడు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, సంతబొమ్మాళి టిడిపి మండల అధ్యక్షుడు జీరు భీమారావు, టెక్కలి మండల అధ్యక్షుడు బగాది శేషు, మెండ దమయంతి, మామిడి రాము పాల్గొన్నారు.

కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు

## క్రైమ్ కార్నర్

## రైలు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**ప్రజాశక్తి - పలాస**

మందస, జాడుపూడి రైల్వేస్టేషన్ మధ్యలో ఆదివారం మందస మండలం సరియాపల్లి గ్రామానికి చెందిన దేశం ప్రధాని రామారావు (45) మృతి చెందినట్లు పలాస జిఆర్‌పి ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**మెళియాపుట్టి:** మండలంలో చొంపాపురం గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చోంపాపురంకు చెందిన యవ్వారి ప్రసాద్(32) మృతి చెందాడు. మృతుడు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య దీపిక, మూడు నెలల పాప ఉంది. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి నాగేశ్వర రెడ్డి

## గంజాయితో ముగ్గురు అరెస్టు

**ఇచ్ఛాపురం:** గంజాయి అక్రమ రవాణాదారులపై ఇచ్ఛాపురం పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రైల్వే ప్రయాణీకులు ముసుగులో ఒడిస్సా నుంచి ఇచ్ఛాపురం మీదుగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ25వేల విలువ చేసే 12 కేజీల740గ్రాముల గంజాయి మూటలను స్వాధీన పర్చుకున్నారు. ఈ మేరకు ఆదివారం సిఐ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి మాట్లాడారు. గంజాయి తరలిస్తున్నట్లు పట్టణ ఎస్ఐ సత్యన్నారాయణకు సమాచారం రావటంతో ఎస్ఐతో పాటు సిబ్బంది దాడులు జరిపారని, శనివారం సాయంత్రం 4.20 గంటల సమయంలో రైల్వే ఎల్‌సి గేటువద్ద ఉన్న ముగ్గురిపై అనుమానం రావటంతో వారి వద్ద ఉన్న మూటలను తనిఖీ చేయగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని డిఎస్‌పి చెప్పారు. గంజాయి మూటలతో పాటు కారు, 3సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. ఒడిస్సా గంజాం జిల్లా బరంపురంకు చెందిన సమీరా బీస్వాయ్, ఒడిస్సా గంజాం జిల్లా దుగిపొంది బ్లాక్‌లో కె.నౌగాంకు చెందిన జితేంద్ర ప్రధాన్, కొత్తకోట చంద్రన్ సుబుద్ధిలు ఒడిస్సాలో కొనుగోలు చేసిన గంజాయి మూటలతో ఇచ్ఛాపురం స్టేషన్‌కి సమీపంలో గల ఎల్‌సి గేటువద్ద అనుమానంగా కనిపించటంతో పట్టుకోవటం జరిగిందన్నారు. డివిజన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. సమావేశంలో సిఐ ఇమ్యాన్యుయెల్ రాజు, పట్టణ, రూరల్, కవిటి ఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మణరావు, రాము పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శిస్తున్న అప్పన్న

## విద్యార్థిని కుటుంబానికి పరామర్శ

**మెళియాపుట్టి:** మండలంలో భరణికోట కాలనీలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని నందిని అనారోగ్యంతో బుధవారం మతి చెందింది. విద్యార్థిని మృతి సంఘటనపై ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ఆదివారం సాయంత్రం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ఈయన వెంట నితిన్ ఉన్నారు.

దీక్షల్లో పాల్గొన్న కొక్కిలిపుట్టుగ గ్రామస్తులు

## కొనసాగుతున్న దీక్షలు

**కవిటి:** తమ బిడ్డల ఉన్నత చదువులు, యువతీ యువకుల ఉద్యోగాన్వేషణకు తమకు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాల్సిందేనని బెంతు ఒరియాలు స్పష్టం చేశారు. అంతవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. తమ గుర్తింపు, తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 60వ రోజుకి చేరుకున్నాయి. ఈ దీక్షలో కొక్కిలిపుట్టుగ గ్రామస్తులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంతు ఒరియాలకు గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలకు కూడా దూరమవుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో ఖత్రో దొలై, మోహన్ సాహు, లోకునాథ్, సుమన్, జయసేన్, కృష్ణ, బృందావన్ పాల్గొన్నారు.

## చిన్నారులకు ఆర్థికసాయం

**పొందూరు:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన మండలంలోని జాడపేట(మలకాం) గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులకు మండల పట్టుశాలి సంక్షేమ సంఘం అండగా నిలిచింది. గత నెలలో విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.వెంకటరావు, ఝాన్సీలక్ష్మిలు మృతిచెందడంతో కుమారులు దుర్గాప్రసాద్, సాయి శరత్ అనాథులుగా మారారు. వారికి పట్టుశాలిసంఘం రూ.42, 500 నగదును ఆదివారం అందించారు.

## మళ్లీ గెలుపు తథ్యం

**ఇచ్ఛాపురం:** టిడిపి, జనసేన ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికలో ఇచ్ఛాపురం అభ్యర్థిగా డాక్టర్ బెందాళం అశోక్‌ను ప్రకటించడంతో మండలం టిడిపి సోషల్ మీడియా టీమ్, ఐటిడిపి మండల అధ్యక్షుడు నరేంద్ర రెడ్డి రెడ్డిక సోషల్ మీడియా కన్వీనర్‌బాలు రెడ్డిలు ఎమ్మెల్యేతో కలిసి కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో గెలిచి మంత్రిగా రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మనోజ్ పాల్గొన్నారు.